క్లుప్తంగా

మే 7న పౌరాణిక పద్యాల ఏకపాత్ర పోషణ పోటీలు

బలిజిపేట: మండలంలోని బడేవలసలో వచ్చే నెల 7వ తేదీ రాత్రి 9గంటలకు పౌరాణిక పద్యాల ఏకపాత్ర పోషణ పోటీలను నిర్వహించనున్నామని ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు దిగువన ఇచ్చే ఫోన్ నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. శ్రీరామాలయ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా శ్రీవాణి, శివాని నాటక సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఎస్.సింహాచలం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారిని సన్మానించి బహుమతులను అందించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని, ఆసక్తి కలిగిన వారు ఫోన్ 9849833439, 8367085591 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పరీక్షల పరిశీలన



బలిజిపేట ఉన్నత పాఠశాలలో పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ-1సామల

బలిజిపేట: ఉన్నత పాఠశాల వార్షిక పరీక్షలను ఎంఈఓ-1సామల సింహాచలం సోమవారం పర్యవేక్షించారు. బలిజిపేట ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న తెలుగు పరీక్ష సందర్భంగా విద్యార్థులకు పరీక్ష రాసే విధానంపై అవగాహన కల్పించారు. చేతిరాత మరింత చక్కగా ఉండాలని దానివల్ల మంచి మార్కులు వస్తాయని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మక్కువలో అన్న సమారాధన



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న మావుడి రంగునాయుడు

మక్కువ: శ్రీరామనవమిని పురస్కరించుకుని మక్కువలోని రామిరెడ్డి వీధిలో సోమవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు హాజరై భక్తులకు ప్రసాదాన్ని వడ్డించారు. మండలంలోని డబ్బూరివలస, శాంతిస్వరం, కొండపేట, మక్కువలోని పలు వీధులకు చెందిన భక్తులు అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యపై దృష్టి పెట్టాలి


- ఎంపీపీ బి.ప్రమీల



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బి. ప్రమీల

పాచిపెంట: గిరిజన ప్రాంతాల్లో అధికారులు తాగునీటి సమస్యపై దృష్టి పెట్టాలని ఎంపీపీ బి.ప్రమీల కోరారు. ఈ మేరకు సోమవారం పాచిపెంట మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బి.ప్రమీల అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అధికారులు ముందుగా శాఖల వారీగా నివేదికలను వెల్లడించారు. వేసవి ఎండలు తీవ్రం కావడంతో పలు గిరిశిఖర ప్రాంతాల్లో తాగునీటి సమస్య నెలకొందని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒలిసెల మడ గ్రామానికి రోడ్డు సదుపాయం లేక తాగునీటి కోసం గిరిజనులు మైళ్ల దూరం వెళ్లాల్సి వస్తోందని, కొటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు సమావేశంలో మొరపెట్టుకున్నారు, పాంచాలి గ్రామంలో విద్యుత్తు లో వోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని ఆ సమస్యను పరిష్కరించాలని పాంచాలి సర్పంచ్ గూడెపు యుగంధర్ కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సర్వసభ్య సమావేశంలో సభ్యులు విన్నవించుకున్న సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు ధనంజయ్, మీసాల నారాయణమ్మ ఎంపీడీవో పాత్రో తహసిల్దార్ రవి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా సీతారాముల పట్టాభిషేకం



సీతారాముల పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

సాలూరు: పట్టణంలోని పెదకోమటిపేట, నెయ్యిలవీధి తదితర ప్రాంతాల్లో సోమవారం సీతారాముల పట్టాభిషేక మహోత్సవం కనుల పండువగా జరిగింది. శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలుచేశారు. ఈ సందర్భంగా స్థానికంగా ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది.

కానరాని కాడెద్దులు..!

- పెరిగిన యంత్ర పరికరాల వినియోగం
- తడిసిమోపెడవుతున్న పెట్టుబడులు
- ఫలితం ఇవ్వని దిగుబడులు
- లబోదిబోమంటున్న రైతులు

బలిజిపేట:

ఆరుగాలం శ్రమించి పంటలను సాగుచేస్తున్న అన్నదాతలను కష్టాలు వెంటాడుతున్నాయి. వ్యవసాయ రంగంలో అన్ని పనులూ యంత్రాలతోనే చేయాల్సి రావడంతో రైతులకు పెట్టుబడి భారం పెరుగుతోంది. కాడెద్దులు కరువాయె.. ట్రాక్టర్ సేద్యం బరువాయె అన్న చందంగా రైతుల పరిస్థితి మారుతోంది. గతంలో పొలం దుక్కి దున్నాలన్నా, పంట సాగు చేయాలన్నా కాడెద్దులే ప్రధానంగా ఉండేవి. ప్రస్తుతం గ్రామీణులు అన్ని పనులకూ ట్రాక్టర్లు, ఇతర యంత్రాలను వినియోగిస్తున్నారు. పొలం కౌలుకు తీసుకున్న రైతులు సైతం యంత్ర పరికరాలపైనే ఆధారపడుతున్నారు. కాడెద్దులు ఉంటే గతంలో చేతినిండా పని, సొమ్ము ఉండేది. ఇప్పుడు పనిలేక, వాటిని పోషించలేక విక్రయిస్తున్నారు.



పొలంలో ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు

ఆధునిక పరికరాలతో..

పల్లెల్లో గతంలో తెల్లవారగానే రైతులు ఎద్దులతో పొలాలకు చేరుకునేవారు. 10 ఎకరాలు దుక్కి దున్నాలన్నా ప్రతిరోజూ నాగలిపట్టి, కాడెద్దులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు దున్నుకుని వచ్చేవారు. పదిరోజులు పట్టినా కష్టం తెలిసేది కాదు. ప్రస్తుతం కొన్ని గంటల్లోనే ట్రాక్టర్‌తో దున్నేస్తున్నారు. అలాగే గతంలో రైతు పండించిన పంటలు వేరుశనగ, వరి, అపరాలు, తదితర పంట దిగుబడులు కళ్లానికి తీసుకువచ్చి వాటిని బాగు చేసి అక్కడి నుంచి ఇంటికి చేర్చడానికి రోజుల తరబడి పట్టేది. ప్రస్తుతం ఆధునిక పరికరాలు వినియోగిస్తుండడంతో గంటల వ్యవధిలో పంట దిగుబడులు తయారై వాటిని ఇంటికి తీసుకురాకుండానే అక్కడే విక్రయించేస్తున్నారు. అతి తక్కువ మంది రైతులు కాయకష్టంతో, కాడెద్దులతో రోజుల తరబడి పంటలను పండించుకుని జాగ్రత్త పడుతున్నారు.

తీవ్రంగా కూలీల కొరత

ఎన్ని యంత్రాలు వచ్చినా వ్యవసాయంలో కూలీల అవసరం తప్పనిసరి. పంట సాగు చేశాక వాటి సంరక్షణ కీలకం. పంటలు సాగు చేసిన 20రోజుల నుంచే పురుగు మందులను పిచికారీ చేయాల్సి వస్తోంది. అయితే మందులు పిచికారీ చేసేందుకు కూలీలు దొరకడం లేదు. దీంతో సకాలంలో మందులు పిచికారీ చేయకపోతే సాగులో నష్టాలను చూడాల్సి వస్తోంది. అంతేకాక కూలీలతో మందులను పిచికారీ చేయడం ఖర్చుతో కూడుకున్న పనిఅయిపోయింది. దీంతో సాగులో పెట్టుబడులు పెరిగి దిగుబడులు అందక రైతులు నష్టాల బారిన పడుతున్నారు.



ఎద్దులతో సిద్ధం చేస్తున్న రైతు

గతంలో ఎద్దులకు డిమాండ్

గతంలో సేద్యం చేయాలంటే బండి, ఎద్దులు, పోతులు ఉండేవి. వాటికి భలే డిమాండ్ ఉండేది. ప్రస్తుతం యంత్రపరికరాల సేద్యం రావడంతో వాటికి ఆదరణ కరువైంది. ఉన్న ఎద్దులను పోషించలేక విక్రయిస్తున్నారు. యంత్ర పరికరాలతో వ్యవసాయం చేయించుకుని ఎప్పటికప్పుడు చేతులు దులుపుకుని వెళ్లిపోతున్నారు. కూలీల భారం ఎక్కువై పోయింది.

రాములునాయుడు, రైతు, బలిజిపేట

గ్రామసేవకుల సమస్యలు పరిష్కరించాలి

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో నిరంతరం గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటున్న గ్రామ (వీఆర్‌ఏలు)సేవకులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా నాయకుడు జి.వెంకటరమణ అన్నారు. వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా నాయకుడు జి. వెంకటరమణ ఆధ్వర్యంలో వీఆర్‌ఏలంతా సోమవారం హెచ్ డీటీ ఉమామహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకూ అమలు చేయకపోవడంతో ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. అలాగే నామమాత్రమైన వేతనాలతో నిరంతరం సేవలందిస్తున్న గ్రామ సేవకులకు కనీసవేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని ఈ ఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అందరినీ నాలుగోతరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు జి.ఆనంద్, బి.జోగులు, జోజీ, లక్ష్మి, అశిరమ్మలు పాల్గొన్నారు.



హెచ్‌డీటీకి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకుడు వెంకటరమణ, వీఆర్‌ఏలు

అక్రమ సస్పెన్షన్ అన్యాయం

పార్వతీపురం: ఆర్టీసీ డిపోలో కార్మికుల అక్రమ సస్పెన్షన్‌లు అన్యాయమని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.సీతాలక్ష్మి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్ డిపో ఆవరణలో ఏఎస్‌టీ బాబుపై విధించిన అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్వతీపురం ఆర్టీసీ డిపో మేనేజర్ 1/2019సర్క్యులర్‌కు విరుద్ధంగా కార్మికులపై సస్పెన్షన్ విధించడం, బదిలీలు చేస్తున్నారన్నారు. కార్మికుల సమస్యలపై, డిపోలో జరుగుతున్న అక్రమాలను ప్రశ్నిస్తున్నారనే కారణంగా ఏఎస్‌టీ బాబుపై తప్పుడు ఫిర్యాదు చేయించి సస్పెన్షన్ చేయడం అన్యాయమన్నారు. డిపో మేనేజర్ చర్యలు కక్షపూరితమైనవని, చట్ట వ్యతిరేకమైనవని ఆరోపించారు. విధి నిర్వహణలో కార్మికులు తప్పుడు కార్యక్రమాలు చేపడితే దానిపై విచారణ చేపట్టి క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని, అందుకు విరుద్ధంగా కార్మికుడిపై సస్పెన్షన్ విధించడం అన్యాయమని విమర్శించారు. తక్షణమే సస్పెన్షన్‌కు గురైన ఏఎస్‌టీ బాబును విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, విజయనగరం జోనల్ అధ్యక్షుడు రాములు, చంద్రయ్య పాల్గొన్నారు.



డిపో ఎదుట ఆందోళన చేస్తున్న వర్కర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు

స్పందనలేని పీజీఆర్ఎస్



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న కృష్ణమూర్తి

సీతానగరం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ప్రజల నుంచి స్పందన కరువైంది. ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు ఉదయం పది గంటలనుంచి కార్యక్రమం నిర్వహించారు. గతంలో చేసిన ఫిర్యాదులకు పరిష్కారం కానరాకోపోవడంతో ప్రజలెవరూ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసేందుకు పెద్దగా ఆసక్తి కనబరచలేదు. ఫిర్యాదులు చేసినా సమస్యలు పరిష్కారం కాని గ్రీవెన్స్‌సెల్ ఎందుకని ప్రజలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో కాశీపేటలో జల్‌జీవన్ మిషన్ పథకం నిధులతో ఇంటింటి కుళాయిలు ఊరంతా వేసినా వేసినా రెడ్డివీధిలో పూర్తిస్థాయిలో కుళాయిలు వేయకపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తుడు టి.కృష్ణమూర్తినాయుడు ఎంపీడీఓ పిత్రివిక్రమరావుకు వినతిపత్రం అందజేయగా తాగునీటి సమస్య పరిష్కరిస్తామని ఎంపీడీఓ తెలియజేశారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వెంటనే నిలిపివేయాలి

పాచిపెంట: రాష్ట్రంలో ప్రజలపై భారం మోపే, ఇంటింటికీ విద్యుత్‌స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే ప్రభుత్వం నిలిపివేయాలని సీపీఎం మండల కమిటి డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం విద్యుత్ స్మార్ట్ మీటర్లు మాకొద్దు విద్యుత్‌ధరలు తగ్గించాలని ముద్రించిన కరపత్రిక స్టిక్కర్‌లను మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు కోరాడ ఈశ్వరరావు, బోనుగౌరు నాయుడు మాట్లాడుతూ, రూ.17వేలకోట్లు సర్దుబాటు చార్జీల పేరుతో ఇప్పటికే భారాలు వేసి ప్రజల నడ్డి విరిచారన్నారు. ఇప్పుడు స్మార్ట్ మీటర్లు తగిలించి మరోదోపిడీకి సిద్ధమవుతున్నారని విమర్శించారు. అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు నేడు విద్యుత్ భారం వేసి ప్రజలకు నడ్డివిరిచే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. వాటిపై ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు వద్దని వ్యవసాయ రంగాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్‌స్మార్ట్ మీటర్లు మాకొద్దు అనే స్టిక్కర్‌లను ఆవిష్కరిస్తున్న నాయకులు తదితరులు

ప్రజారోగ్యమే వైద్యాధికారులు, సిబ్బంది లక్ష్యం

సీతానగరం: ప్రజల ఆరోగ్యపరిరక్షణే మందరి కర్తవ్యమని పీహెచ్‌సీ డాక్టర్ పి.పావని అన్నారు. ప్రపంచ ఆరోగ్యదినోత్సవాన్ని పురస్కరిచుకుని సోమవారం స్థానిక పీహెచ్‌సీ నుంచి హనుమాన్ జంక్షన్ వరకు ప్రజారోగ్యంపై అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పావని మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని కోరారు. అలాగే ప్రజలకు ఆరోగ్య సూత్రాలను వివరిస్తూ హనుమాన్ జంక్షన్ వద్ద వైద్య సిబ్బందితో మానవహారం నిర్వహించారు. సీహెచ్‌ఓ ఎస్వీ రమణ మాట్లాడుతూ వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున కాళ్లకు పాదరక్షలు, తలపై తెల్లని వస్త్రం వేసుకుని పనుల్లో పాల్గొవాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప ఎండలో తిరగవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు భవాని, సత్యవతి, శర్మ,ఏఎస్ఎంలు, పీహెచ్‌సీ టెక్నీషియన్‌లు,సురేష్,ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

బకాయి చలానాలు చెల్లించాలి

సీతానగరం: వాహన చోదకులంతా గతంలో బాకీపడిన అపరాధరుసుం విధిగా చెల్లించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని, హెల్మెట్ ధరించి ప్రాణాలను రక్షించుకోవాలని ఏఎస్సై ఎల్.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని హనుమాన్ జంక్షన్ వద్ద సిబ్బందితో కలిసి సోమవారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. వాహనాలకు వివిధ కారణాలపై అపరాధరుసుం విధించామని విధించిన అపరాధ రుసుం తక్షణమే చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు అభయం పోక్సో

- చట్టంపై అవగాహన అవసరం

పార్వతీపురం రూరల్: ముక్కుపచ్చలారని చిన్నారులు, బాలికలపై లైంగిక దాడులు, వేధింపులకు పాల్పడే వారి తాట తీసి పోక్సో చట్టం కామాంధుల పట్ల కఠినంగా వ్యవహరిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని 2012లో తీసుకువచ్చింది. పోక్సో చట్టంపై అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరమని న్యాయవాదులు, పోలీసుశాఖ ఇప్పటికే పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ముద్దాయికి శిక్ష

పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం విక్రాంపురం గ్రామానికి చెందిన కోరాడ రామారావు అనే వ్యక్తి బాలికపై లైంగికదాడికి పాల్పడినట్లు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా కోర్టులో నేరం రుజువైనందున ముద్దాయికి న్యాయస్థానం 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరిచింది. అలాగే రూ. 13వేలు జరిమానా కూడా విధిచింది.

చట్టంపై అవగాహన తప్పనిసరి

18ఏళ్ల లోపు బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవు, బాలిక అంగీకారంతోనైనా సరే, ఆమెతో శారీరక సంబంధం పెట్టుకుంటే అత్యాచారం కిందే పరిగణిస్తారు. అలాగే కేసు నిరూపించేందుకు బలమైన సాక్ష్యాధారాలు ఉండాలి.



నేరం రుజువైతే శిక్ష తప్పనిసరి



కోర్టులో నేరం రుజువైతే కఠిన శిక్ష విధించనున్నారు. ప్రధానంగా చిన్నారులపై అత్యాచారాలను నిరోధించేందుకు పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం. కేసులను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక కోర్టులు ఉన్నాయి. బాధితులు తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటారు.

టి.జోగారావు, ప్రముఖ న్యాయవాది

ఇదేనా చట్టాలపై మీకున్న అవగాహన?

- ఇండిపెండెంట్ సభ్యురాలి సంతకం వేరొకరు పెట్టింది వాస్తవం కాదా..
- మీరిచ్చిన నోటీసు ఎందుకు తిరస్కరణకు గురైంది..
- ఏం ఆశించి పార్టీలు మారారో ప్రజలకు చెప్పండి చాలు
- పార్వతీపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ గౌరీశ్వరి, వైస్ ఛైర్మన్లు గున్నేశ్వరరావు, రుక్మిణి

సాక్షి, పార్వతీపురం మన్యం: కూటమి ప్రభుత్వంపైన, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, జంపింగ్ కౌన్సిలర్ల మీద ఎవరికీ విశ్వాసం లేదు కాబట్టే.. వారు పెట్టిన అవిశ్వాస తీర్మానం తిరస్కరణకు గురైందని పార్వతీపురం పురపాలక సంఘ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు యిండుపూరి గున్నేశ్వరరావు, రుక్మిణి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ అన్నారు. స్థానిక విలేకరులతో వారు సోమవారం మాట్లాడుతూ.. ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందన్న దానికి ఈ ఉదంతం ఒక ఉదాహరణని చెప్పారు. వైఎస్సార్‌సీపీకి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లపైన, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపైన కొంతమంది కూటమి నాయకులు, జంపింగ్ కౌన్సిలర్లు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సభ్యుడు కాకపోయినప్పటికీ.. కోరం గురించి జయబాబు అనే వ్యక్తి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. కోరానికి, నోటీసుకు ముందు తేడా తెలుసుకోవాలని సూచించారు. కోరమంటే నోటీసు చేయడం కాదని.. 2/3 వంతు సభ్యులను సభలో చూపించడమని తెలిపారు. 'ఒక ఇండిపెండెంట్ సభ్యురాలి సంతకం ఎవరు పెట్టారు.. నీకు ఏం హక్కు ఉందని సంతకం పెట్టావు.. నీవు నమ్మిన దైవం సాక్షిగా ప్రమాణం చేసి చెప్పగలవా?' అని ప్రశ్నించారు. డబ్బు, అధికారంతో పార్వతీపురంలో ఏం చేసినా చెల్లుతుందనుకోవడం అవివేకమన్నారు. 'అంతా సక్రమంగా ఉందనుకుంటే.. అవిశ్వాసం నోటీసు ఎందుకు తిరస్కరణకు గురైంది. ప్రతి ఒక్కరి వద్ద కలెక్టర్ మా స్నేహితుడు అని చెప్పుకొని తిరుగుతావ్ కదా.. నోటీసు ఎందుకు తిరస్కరించారో కలెక్టర్ గారు మీకు చెప్పలేదా?' అని ప్రశ్నించారు. 'కౌన్సిలర్‌గా ఉంటూ.. సంస్కృత పాఠశాలలోనూ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ ఆనంద్‌కుమార్, రవి కుమార్ పని చేయడం నిజం కాదా.. మీ బ్యాంకు ఖాతాలను చూపిస్తే నిజాలు బయటపడతాయి. రూ.వేలల్లో జీతాలు ఏ ఖాతాను వస్తున్నాయి. ఇప్పటి వరకు ఎంత డ్రా చేశారన్న విషయాలు బహిర్గతమవుతాయి. చూపించడానికి మీరు సిద్ధమేనా?' అని సవాల్ విసిరారు. నిరుపేదగా చెప్పుకొంటున్న కౌన్సిలర్ మంత్రి రవికుమార్‌కు అన్ని స్థలాలు ఎక్కడ నుంచి వచ్చాయని.. హెచ్.కారాడవలస లేఅవుట్, ఆశాజ్యోతి ఆశ్రమం వెనుక, పార్వతీపురం 'సి' లేఅవుట్‌లోని స్థలాలు ఎలా పొందారని.. ఈ మధ్యనే విక్రయాలు చేసిన విషయం వాస్తవం కాదా? త్వరలోనే దీనికి సంబంధించిన ఆధారాలన్నీ బయటపెడతామని చెప్పారు. ప్రజాసమస్యలను గాలికొదిలేసి, పక్క పార్టీ వారిని లాక్కొని, మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని కలలుగంటున్నది కూటమి వారేనని..

ఊర్లు పట్టుకుని తిరుగుతున్నారంటూ తమ సభ్యులను విమర్శించే అర్హత ఎవరికీ లేదని స్పష్టం చేశారు. 'పార్వతీపురాన్ని అభివృద్ధి చేస్తామని మీ ఎమ్మెల్యే అంటున్నారు. ఇప్పుడు 18 మంది సభ్యులు మీ వెంటే ఉన్నారని చెప్పుకొంటున్నారు కదా.. ఈ కాలంలో అభివృద్ధి ఏం చేశారు.. ఎక్కడ చేశార'ని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో డంపింగ్ యార్డును మారుస్తామని, జంఝావతి నుంచి పార్వతీపురానికి మంచినీరు ఇస్తామన్న మాటలు ఏమయ్యాయన్నారు. తప్పుడు పనులు చేశారు కాబట్టే పత్రికల్లో వచ్చాయని, ఇది అందరికీ తెలిసిన విషయమేనని చెప్పారు. నోటీసుపై ఎక్స్ అఫీషియోగా స్థానిక ఎమ్మెల్యే సంతకం ఎలా చేస్తారని.. అవిశ్వాసానికి వెళ్లినప్పుడే ఆయన సంతకం చెల్లుబాటు అవుతుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ బీ ఫారం తీసుకుని, రాజకీయంగా లబ్ధి పొందిన వ్యక్తులు ఓసారి పునరాలోచన చేసుకోవాలని.. ఏం ఆశించి పార్టీలు మారారో ప్రజలకైనా సమాధానం చెప్పాలని హితవు పలికారు.

నేటి నుంచి పౌష్టికాహార పక్షోత్సవాలు

మక్కువ: మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం నుంచి, ఈనెల 22వ తేదీ వరకు పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు పాచిపెంట ప్రాజెక్టు సీడీపీఓ బి.అనంతలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భధారణ మొదలుకుని 2సం వత్సరాల వయస్సు వరకు పోషకాహారం ప్రాముఖ్యత, పోషణ,సంరక్షణ, బరువు తక్కువగల పిల్లల గుర్తింపు, సంరక్షణ చర్యలపై పిల్లల తల్లులకు వివరించనున్నట్లు ఆమె తెలిపారు. అలాగే అంగన్వాడీ కేంద్రంలో లబ్ధిదారుల వివరాలు స్వయంగా నమోదు చేసుకోవడం, పిల్లలు ఆరోగ్యకరమైన జీవన శైలి, ఆహార పద్ధతులు అలవాట్లపై అవగాహనా కార్యక్రమలు నిర్వహిస్తామని తెలిపారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఐదుగురు విద్యార్థుల ఎంపిక

పార్వతీపురం రూరల్: మండలంలోని బందలుప్పి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఐదుగురు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గంటేడ శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ. 12వేలు చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ప్రోత్సాహకం అందనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారిలో కె.తేజశ్విని, కావ్యకుసుమ, పి. ప్రవంతి, ఎస్.యూన్సీ, జి.లాస్య ప్రియ ఉన్నారు. వారిని హెచ్ఎంతో పాటు ఇతర ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలి



కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, ఉపాధి వేతనదారులు

పార్వతీపురంటౌన్: ఉపాధి బకాయిలు చెల్లించి వేతనదారులకు పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఉపాధి వేతన దారులతో నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి నెల నుంచి పనిచేసిన ఉపాధి వేతన దారులకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సుమారు రూ. 50కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని, పనిచేసిన 14రోజులకే వేతనం చెల్లించాలని చట్టంలో ఉన్నప్పటికీ ఇంతవరకు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఫారం ఫాండ్ పనులు చేయాలని, వేసవి కాలంలో సక్రమంగా పనులు ఇవ్వకుండా అనేకమంది వేతన దారులకు గత ఏడాది 100రోజుల పని పూర్తి కాకుండానే ముగించారన్నారు. గతంలో ఉపాధి పని నిర్వహించే ప్రాంతాల్లో టెంట్లు, మెడికల్ కిట్లు, మంచినీరు, మజ్జిగ ఇచ్చేవారని, ఉపాధి మేట్లకు రూ. 5లు ఒక వ్యక్తికి ప్రోత్సాహం ఇచ్చేవారన్నారు. ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వాటన్నింటినీ రద్దు చేయడం బాధాకరమన్నారు. వేతనదారులకు అన్యాయం జరుగుతోందని, భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి ఈశ్వరరావు, సహాయకార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు పి.రాము, బి.మోహనరావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటుసరే..నీరేదీ..?

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రంలో దాహార్తిని తీర్చేందుకు నీరు లేకుండా చలివేంద్రం ఖాళీగా సోమవారం దర్శనమిచ్చింది. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీలను ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు ఖాళీగా ఉన్న చలివేంద్రాన్ని చూసి మట్టి కుండలు సైతం లేకుండా చలివేంద్రం దర్శనమివ్వడంతో తాగేందుకు నీరు లేని చలివేంద్రాన్ని ఏర్పాటుచేయడం దేనికని ప్రశ్నిస్తున్నారు.



నీటికుండలు లేకుండా ఖాళీగా దర్శనమిస్తున్న చలివేంద్రం